క్లుప్తంగా

నేడు మంత్రి రాజా పర్యటన

తుని: రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరవుతారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు సోమవారం తెలిపారు. ఉదయం 11.30 గంటలకు తుని పట్టణం నారాయణరాజు గారి వీధిలో నిర్మించిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. 12 గంటలకు ప్రత్తిపాడు నియోజకవర్గం అన్నవరంలో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తారన్నారు. సాయంత్రం 4.30 గంటలకు తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జరిగే శత వార్షికోత్సవంలో పాల్గొంటారని చెప్పారు.

నేడు డయల్ యువర్ డీఎం

తుని: ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తుని ఆర్టీసీ డిపో మేనేజర్ కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకూ ప్రయాణికుల సూచనలు, సలహాలు తీసుకుంటామన్నారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు 73827 81490 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు తెలియజేయాలని కోరారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



స్వామి వారికి పూజలు చేస్తున్న పండితులు

గోకవరం: మండలంలోని తంటికొండలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రధాన కుంభ కళావాహన, స్వస్తి నిర్వహించారు. అనంతరం పండిత సత్కారం, మహదాశీర్వచనం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), ఈఓ ఆర్వీ చందన, దేవస్థానం కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

తొండంగి: ఏవీ నగరలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిరోజూ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. మంగళ, బుధవారం సాయంత్రం ప్రవచన కర్తలు గరికిపాటి, చాగంటి కోటేశ్వరరావులతో ప్రవచ పఠనం ఏర్పాటు చేశామన్నారు. చివరి రోజు గురువారం ఆలయం వద్ద అన్నసమారాధన, సాయంత్రం గ్రామంలో రథోత్సవం నిర్వహిస్తామని వివరించారు.

రేపు అఖండ విష్ణు సహస్ర పారాయణం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 1న అఖండ విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహిస్తున్నట్టు ఆలయ చైర్మన్ కోలా భీమేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సహస్ర నామ పారాయణం, రోజు రాత్రి 7.30 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

రోగులకు పాలు, పండ్లు పంపిణీ

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు సోమవారం పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. మండల పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉద్దగిరి సోమరాజు తండ్రి చిన బుచ్చిరాజు వర్ధంతి సందర్భంగా మండల వైద్యాధికారి శైలజ ఆధ్వర్యంలో రోగులకు వీటిని అందజేశారు.

ఘనంగా బల్లల పండగ

ఏలేశ్వరం: పట్టణంలోని రజకులు సోమవారం బల్లల పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక పైడిమల్లమ్మగుడి వీధి రజకసంఘం ఆధ్వర్యంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. సంఘ అధ్యక్షుడు పాకలపాటి సోమరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని పలువీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. బాజాభజంత్రీలు, మేళతాళాల, తీన్‌మార్ డ్యాన్స్, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపు ఘనంగా జరిగింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కిర్లంపూడి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై టి.రఘునాథరావు సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే..సామర్లకోటకు చెందిన పోలపల్లి శివకృష్ణ (25) ఆదివారం పెళ్లిచూపులకు బైక్‌పై ధర్మవరం బయలుదేరాడు. మండలంలోని రాజుపాలెం శివారులో కిర్లంపూడి నుంచి సామర్లకోట వైపు వెళ్తున్న గుర్తు తెలియని ఆటో అతడిని బలంగా ఢీకొట్టింది. వెనక వస్తున్న బంధువులు అతడిని వెంటనే 108లో ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు సోదరుడు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలపై గరంగరం

- ప్రజా సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం



సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి



సమస్యలపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

తుని: పట్టణాభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి కోరారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో సోమవారం చైర్‌పర్సన్ సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పట్టణాభివృద్ధికి సంబంధించి అజెండాలో పొంది పరిచిన 64 అంశాల్లో 5 అంశాలకు నిధుల లభ్యత లేనందున రద్దు చేసి, మిగిలిన అంశాలకు ఆమోదం తెలిపారు. మన మున్సిపాలిటీ–మన బాధ్యత కార్యక్రమానికి కౌన్సిలర్లు అందరూ విధిగా హాజరు కావాలని చైర్‌పర్సన్ సుధారాణి కోరారు.

జీరో అవర్‌లో..

ప్రజా సమస్యలను వివరించేందుకు నిర్వహించిన జీరో అవర్ గరంగరంగా సాగింది. ప్రభుత్వ భూమిలో తాత్కాలిక నివాసం ఉంటున్న పేదలకు ఎల్‌పీసీలు మంజూరు చేయాలని కౌన్సిలర్ ఆరుగుల రవికుమార్ కోరారు. పైపులైన్ పగిలిపోవడంతో నీటి సమస్య ఉందని, మూడు నెలలుగా మరమ్మతులు చేయలేదన్నారు. రేషన్‌బియ్యం సరిగా అందడం లేదని కౌన్సిలర్ కర్రి సత్య జగదీష్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై తహసీల్దార్ బాల సుబ్రహ్మణ్యం వివరణ ఇచ్చారు. బియ్యం సరఫరా చేసే వాహనాలకు డ్రైవర్ల కొరత ఉందని, వృద్ధులకు వేలిముద్ర, ఐరీష్ పడకపోతే మూడు సార్లు ప్రయత్నించాలని, అప్పటికే అవ్వకపోతే వలంటీర్‌కు కార్డు వివరాలు వెళతాయన్నారు. వలంటీర్ తంబ్ వేస్తే రేషన్ వస్తుందన్నారు. సింగిల్ రైస్ కార్డు కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై వలంటీర్లు, వీఆర్వోలకు గైడ్‌లైన్స్ ఇవ్వాలని మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్ కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షన్‌దారులకు సింగిల్ కార్డు జారీ చేసే అవకాశం ఉండదని తహసీల్దార్ తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

వ్యర్థాల సమస్యపై..

మెయిన్‌రోడ్డులో తోపుడు బండ్లు వ్యాపారుల వలన వ్యర్థాలు పేరుకుపోతున్నాయని, వీటిపై ప్రజా ఆరోగ్యశాఖ, పోలీసులు సంయుక్తంగా డ్రైవ్ నిర్వహించాలని ఇచ్చిన సూచన ఏ మేరకు అమలు చేశారని కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు ప్రశ్నించారు. తోపుడు బండ్ల వ్యాపారులకు చెత్తను డ్రమ్ములో వేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సూచించామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శేఖర్ చెప్పారు. ఉదయం 11 గంటల తర్వాత ట్రాక్టర్, కార్మికులను పంపాలని చైర్‌పర్సన్ సుధారాణి ఆదేశించారు. ఒకటో వార్డులో కరెంట్ స్తంభాలు వేయలేదని, మార్కెట్ యార్డు దగ్గర ట్రాఫిక్ సమస్య ఉందని, రాజుపేట దగ్గర కొత్తగా ఇళ్లు నిర్మాణం చేసుకునేందుకు నీరు, విద్యుత్ సమస్య ఉందని కౌన్సిలర్లు వారాధి జ్యోతి, కనిగిరి వెంకట రమణ, వాసంశెట్టి శ్రీనివాసరావు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై ఆయా శాఖలకు చెందిన అధికారులు వివరణ ఇవ్వాలని చైర్‌పర్సన్ సుధారాణి ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు త్వరలో వేస్తారని, ట్రాఫిక్ కానిస్టేబుల్ ఏర్పాటు, కొత్త బోర్లు నిర్మాణం చేపడతామని అధికారులు వివరించారు. రామకృష్ణాకాలనీలో కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కౌన్సిలర్ కాసే సుమతి కోరారు. మున మున్సిపాలిటీ–మన బాధ్యత కార్యక్రమంలో వచ్చిన సమస్యలను ఎంత వరకు పరిష్కరించారని కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు అడిగారు. అధిక శాతం సమస్యలు పరిష్కరించామని కమిషనర్ ప్రసాదరాజు సమాధానం ఇచ్చారు. రోడ్లపై బిల్డింగ్ మెటీరియల్ వేయకుండా ఎందుకు చర్యలు తీసుకోలేదని టౌన్ ప్లానింగ్ అధికారులను చైర్‌పర్సన్ సుధారాణి ప్రశ్నించారు. సచివాలయాల కార్యదర్శులతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని టీపీఎస్ ప్రవీణ్ అన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మంత్రి రాజా పరామర్శ



తొండంగిలో వైఎస్సార్ సీపీ నాయకులు కందా మురళి, కందా రాజాలను పరామర్శిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తొండంగి: మండలంలోని తొండంగి, శృంగవృక్షం గ్రామాల్లోని బాధిత కుటుంబాలను రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సోమవారం పరామర్శించారు. శృంగవృక్షంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కొప్పన రాజబాబు తల్లి సూర్యకాంతం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. తొండంగిలో పార్టీ నాయకులు కందా రాజా, కందా మురళి తల్లి కందా కమల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మంత్రి దాడిశెట్టిరాజా వారి ఇళ్లకు వెళ్లి రాజబాబు, రాజా,ా మురళితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు గాబు రాజు, తొండంగి ఉపసర్పంచ్ కందా బాబ్జి, ఎంపీటీసీలు శివకోటి ప్రకాష్, అడపా సూర్యచక్రం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కిర్లంపూడి: రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు స్థానిక విజ్ఞాన భారతీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గాడి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా స్థాయి చెకుముకి పోటీలు జూనియర్ విభాగంలో పి.భారతి, బి.దుర్గాకామేశ్వరి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన వివరించారు.

దుర్గాంబికా అమ్మవారికి బోనాల సమర్పణ



తొండంగిలో దుర్గాంబికా అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు తరలివెళ్తున్న మహిళలు

తొండంగి: స్థానిక కృష్ణాలయం వద్ద వేంచేసిన దుర్గాంబికా అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రామానికి చెందిన సుమారు 500 మంది మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి, పసుపునీటి బిందెలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ప్రధానాలయానికి చేరుకుని అమ్మవారికి ఆ జలాలను అభిషేకించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి మహా చండీహోమం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఇళ్ల స్థలాల పరిశీలన



గండేపల్లిలో ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ, ఇతర అధికారులు

గండేపల్లి: స్థానిక పోలవరం ఎడమ కాలువ గట్టు ప్రాంతంలో పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలను సోమవారం పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు, పోలవరం ప్రాజెక్ట్ అధికారులు ఆదినారాయణ, సాయిక్రిష్ణ, ప్రమీల పరిశీలించారు. ఈ స్థలాల్లో పోలవరం కాలువ మట్టి ఉండడంతో ఇళ్లు నిర్మించుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. కాగా కొంత మంది పోలవరం కాలువ మట్టి బయటకు తరలించేందుకు ప్రయత్నిస్తుండటంతో అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు చొరవ తీసుకుని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాతో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇళ్ల స్థలాలను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిన్నారావు, హౌసింగ్ అధికారులు జె.రాజకుమార్, ఆర్ఎస్‌కే రాజు, రాంబాబు, వీఆర్వో క్రిష్ణ పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నివారణపై అవగాహన



గోకవరంలో ప్రజలకు కుష్ఠు వ్యాధి అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

జగ్గంపేట: కుష్ఠువ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని జగ్గంపేట ఉప సర్పంచ్ బండారు రాజా అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం రాజపూడి పీహెచ్‌సీ డాక్టర్ శ్రీరామ్ ఆధ్వర్యంలో కుష్ఠువ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కుష్ఠువ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ శ్రీరామ్ వివరించారు. గ్రామ సచివాలయాల్లో ఆరోగ్య సిబ్బందితో వచ్చే నెల 13 వరకూ జాతీయ కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సావాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, సీహెచ్‌ఓ శర్మ, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కిర్లంపూడి: ప్రపంచ కుష్ఠువ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ బి.రాంబాబు నాయక్ కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. తొలిత మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, ఎంపీపీ బొడ్డేటి గణపతి, ఎంపీటీసీ కాళ్ళ దొంగబాబు, రాపేటి ప్రసాద్, గుడాల రాంబాబు పాల్గొన్నారు.

గోకవరం: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం సర్పంచ్ కొమరం శ్రావని అధ్యక్షతన కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీహెచ్‌ఈఓ వైఎస్ రాయుడు మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. అవగాహనతో వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి రమేష్, ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వరసాల ప్రసాద్, చింతల అనిల్ కుమార్, తుమ్మల శివాజీ, ఇనకోటి పెద్దులు, తుమ్మల చిన్నబ్బు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

జగ్గంపేట: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్సై సీహెచ్ విద్యాసాగర్ పేర్కొన్నారు. స్థానిక గోకవరం, కాకినాడ, ఏలేశ్వరం, గండేపల్లి మార్గాల్లో తిరిగే ఆటో యూనియన్ సభ్యులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఆటోలను రోడ్డుకు ఇరువైపులా పెట్టుకోవాలని సూచించారు. ముఖ్యంగా లైసెన్స్, వాహన రికార్డులు కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన

గండేపల్లి: దిచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని స్థానిక ఎస్సై వై.గణేష్ కుమార్ సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గండేపల్లి ప్రధాన రహదారిపై వాహనదారులకు సోమవారం హెల్మెట్ ధారణ, ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ ధరించండి

తుని: సురక్షిత ప్రయాణానికి వాహన చోదకులు హెల్మెట్ ధరించాలని తుని పట్టణ సీఐ ఎం.నాగ దుర్గారావు కోరారు. సోమవారం సాయంత్రం తుని గొల్ల అప్పారావు సెంటర్లో హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ప్రమాద సమయంలో ప్రాణాన్ని కాపాడుతుందన్నారు. నిబంధనలు పాటించక పోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సూర్ఫిప్రదాత గాంధీజీ



ఏలేశ్వరంలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పట్టణంలో సోమవారం నిర్వహించారు. స్థానిక గాంధీనగర్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి వైఎస్‌స్రాో సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి అలమండ చలమయ్య మాట్లాడుతూ గాంధీ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జాతిపితగా గాంధీజీని గౌరవించవల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తరాలు మారిన గాంధీజీ స్థానం చిరస్థాయిగా ఉంటుందన్నారు. దేశ సొంతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన సేవలను కొనియాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు బొదిరెడ్డి గోపి, సుంకర రాంబాబు, తొండారపు రాంబాబు, దళే కిషోర్, వాగు బలరామ్, తొండారపు రాంబాబు, గూడవిల్లి అర్జునరావు, తోట వెంకట్రావు, పైల శ్రీధర్ పాల్గొన్నారు.

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి ఎంపీపీ లగుడు శ్రీనివాసు, సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, తుని మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, సర్పంచ్ సుర్ల రాంబాబు, వ్యవసాయ సలహామండలి మండలాధ్యక్షుడు సుర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక గాంధీ జంక్షన్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కందిమళ్ళ సామ్యేలు, మూరా నాగేంద్ర, షేక్ అంకా సాహెబ్, బేతా కృష్ణ పాల్గొన్నారు.

శంఖవరం: కత్తిపూడిలోని సీతంపేట రిఫరల్ ఆసుపత్రిలో గాంధీజీ చిత్రపటానికి ఆస్పత్రి చైర్మన్ స్లైసర్‌బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్రోద్యమంలో ఆయన సేవలను కొనియాడారు.

నేడు బావాజీపేటలో గడపగడపకూ..

గోకవరం: మండలంలోని బావాజీపేటలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు సోమవారం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రైసు మిల్లర్ల అక్రమాలను అరికట్టాలి



అక్రమాలకు పాల్పడిన కాకరాపల్లి అయ్యప్ప రైసు మిల్లు ప్రతినిధిని నిలదీస్తున్న డీఎం పుష్పమణి

కోటనందూరు: ధాన్యం కొనుగోలులో రైసు మిల్లర్ల అక్రమాలను అరికట్టాలని రైతులు విజ్ఞప్తి చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన రైతులు, రైసు మిల్లర్లు, వ్యవసాయశాఖ సిబ్బందితో ధాన్యం కొనుగోలులో అక్రమాలపై సమావేశం జరిగింది. రైసు మిల్లర్లు ధాన్యం కొనుగోలులో అక్రమాలకు పాల్పడుతున్నారని రైతులు మంత్రి దాడిశెట్టి రాజాకు ఫిర్యాదు చేశారు. స్పందించిన మంత్రి రాజా జిల్లా జాయింట్ కలెక్టర్‌కు సమాచారమిచ్చి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జేసీ ఆదేశాల మేరకు పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజరు (డీఎం)పుష్పమణి ఈ సమావేశం నిర్వహించారు. గతంలో రంగుమారిన, ముక్కలయ్యే ధాన్యానికి మాత్రమే తరుగు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. కాగా బాగున్న ధాన్యానికి సైతం రైసు మిల్లర్లు క్వింటాల్‌కు నాలుగు కేజీల చొప్పున తరుగు తీసుకుంటున్నారని రైతులు ఆరోపించారు. తరుగుకు సంబంధించి మిల్లర్లు రైతుల నుంచి ముందుగా డబ్బులు వసూలు చేస్తున్నారని, డబ్బులు కట్టని రైతుల ధాన్యాన్ని తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరో పక్క నిబంధనల మేరకు మాత్రమే ధాన్యాన్ని తీసుకుంటున్నామని, అనవసరంగా రైతుల నుంచి తరుగు తీసుకోలేదని రైసు మిల్లర్లు వివరించారు. ఈ సందర్భంగా డీఎం పుష్పమణి మాట్లాడుతూ రైతుకు మంచి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దళారుల ప్రమేయం లేకుండా రైసుమిల్లర్లు, వ్యవసాయశాఖ సహకారంతో ప్రతి రైతుకూ కనీస గిట్టుబాటు ధరను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎవరు అక్రమాలకు పాల్పడినా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, మండలాధ్యక్షుడు సుర్ల రాజు, సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, తుని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, ఏఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జనం మెచ్చిన పాలన జగన్‌తోనే సాధ్యం



దిగుశవాడలో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- దిగుశవాడలో గడపగడపకూ మన ప్రభుత్వం

రౌతులపూడి: అన్నివర్గాల ప్రజలు మెచ్చిన పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని దిగుశవాడలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత మూడేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికులు రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ పింఛన్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. కరోనా కష్టకాలంలోనూ రైతు భరోసా, అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ జలకళ వంటి సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రానున్న కాలంలో ఈ పథకాలన్నీ అమలు కావాలంటే మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గొల్లు చిన్నదివాణం, వైస్ ఎంపీపీలు వాసిరెడ్డి భాస్కరబాబు, సాయి, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, సర్పంచ్ కె.దేవుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రత్తిపాడు/ ప్రత్తిపాడు రూరల్: ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి తెలిపారు. మండలంలోని చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి, లంపకలోవ, ప్రత్తిపాడు, ఒమ్మంగి, ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు సోమవారం ఎంపీపీ గొళ్ల కాంతి సుధాకర్‌తో కలిసి ఆమె స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకంలో పాఠశాలలను ఆధునీకరించి, కార్పొరేట్ పాఠశాలల మాదిరిగా తీర్చిదిద్దారన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, విద్యా వసతి వంటి పథకాలను ప్రవేశపెట్టడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్వీ చలం, ఎంఈఓ వి.రాజబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, చినశంకర్లపూడి సర్పంచ్ ఏపూరి రామారావు, ఎంపీటీసీలు పిల్లా చిన్న, దళే చిట్టికుమారి తదితరులు పాల్గొన్నారు.

గంగాధర్‌కు పర్యావరణ మిత్ర అవార్డు



హైదరాబాద్‌లో గంగాధర్‌కు అవార్డు అందజేస్తున్న తెలంగాణ ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ వినోద్

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థల క్యాషియర్, శారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్‌కు జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు వచ్చినట్టు కళాశాలల వైస్ చైర్మన్ ఎస్. సతీష్‌రెడ్డి తెలిపారు. గంగాధర్ గత 20 సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడంతో ఈ అవార్డు వచ్చిందన్నారు. స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలి బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్‌చైర్మన్ వి.వినోద్ ఆయనకు పురస్కారాన్ని ప్రదానం చేసినట్టు వివరించారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎస్.శేషారెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి, కన్‌స్ట్రక్షన్ విభాగం డైరెక్టర్ మేడపాటి భాస్కర్ చంద్రారెడ్డి, ఇతర సిబ్బంది గంగాధర్‌కు అభినందనలు తెలిపారు.

దివ్యాంగులకు మెరుగైన వసతులు

తుని రూరల్: దివ్యాంగులకు ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పిస్తోందని సమగ్ర శిక్షా అభియాన్ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ చామంతి నాగేశ్వరరావు అన్నారు. తునిలో భవిత కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఫిజియోథెరపీ విభాగాన్ని పరిశీలించారు. దివ్యాంగ చిన్నారులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలు, అలవెన్సులు అందుతున్నాయా ? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ పిల్లల్లాగే దివ్యాంగులు అన్నిరంగాల్లో ముందడుగు వేసే విధంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తోందన్నారు. దివ్యాంగులు తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. సహాయకులకు సైతం అలవెన్సులు అందిస్తూ ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి పరవాడ గీతాదేవి, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌పై దాడి



ప్రత్తిపాడు ఎస్సై సుధాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని చింతలూరులో గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌పై సోమవారం వ్యక్తి దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన రాయుడు ఏసుబాబు స్థానిక సచివాలయానికి వెళ్లి ఇటీవల చనిపోయిన కంటిరెడ్డి సత్తిబాబుకు చెందిన బీమా సొమ్ములు ఎందుకు చెల్లించలేదని వెల్ఫేర్ అసిస్టెట్ మద్దిరాల విజయ్‌కుమార్‌ను ప్రశ్నించాడు. దీనిపై పలు అభ్యంతరాలు ఉన్నాయని, విచారణ చేపట్టాల్సి ఉందని వేల్ఫేర్ అసిస్టెంట్ తెలిపారు. ఆక్రోశంతో ఏసుబాబు వెల్ఫేర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్‌పై దాడి చేశాడు. దీనిపై వేల్ఫేర్ అసిస్టెంట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడిని ఖండించిన సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు

చింతలూరులో గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మద్దిరాల విజయ్‌కుమార్‌పై జరిగిన దాడిని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా, వైస్ ప్రెసిడెంట్ వర్ధిని, మండల అధ్యక్షులు ఈరుగుల ప్రసాద్ తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన ఏసుబాబును కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సచివాలయ ఉద్యోగులు ఎస్సై కె.సుధాకర్, ఎంపీడీఓ ఎస్.వెంకటాచలానికి వినతి పత్రం అందజేశారు. పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.